www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం

శనివారం 18.01.2025



సింగపూర్ ఐటీఈతో కుదిరిన

# ఒప్పందం

తెలంగాణ నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చేందుకు సముఖత

- స్కిల్ యూనివర్సిటీతో ఐటీఈ ఎంవోయూ
- సింగపూర్ లో బిజీబిజీగా తెలంగాణ రైజింగ్ బృందం
- నైపుణ్యాల అభివృద్ధికి పరస్పర సహకారం
- ఆ దేశ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో సీఎం భేటీ
- క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, నిధుల సమీకరణపై చర్చ
- రేపటి వరకు సింగపూర్ లోనే సీఎం బృందం
- కోర్సులు,ప్రణాళికలు,నిర్వహణపై అధ్యయనం
- ఆ దేశ కంపెనీ ప్రతినిధులతో పెట్టుబడులకు ఆహ్వానం

2లో

### సింగపూర్ విదేశాంగ మంత్రితో ముఖ్యమంత్రి భేటీ

ఈ నెల 16న రాత్రి సింగపూర్ చేరుకున్న సీఎం బృందం శుక్రవారం ఆ దేశ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో భేటీ అయింది. ఈ సమావేశంలో సింగపూర్‌లోని అభివృద్ధి పనులతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ప్రణాళికలపై బాలకృష్ణన్, సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎం.. రాష్ట్ర రాజధాని, ముఖ్య నగరాల్లో జరుగుతోన్న అభివృద్ధి కార్యక్రమాలను బాలకృష్ణన్ కు వివరించారు. ప్రధానంగా మూసీ పునరుజ్జీవనం, గ్రీన్ ఎనర్జీ, పర్యాటకం, ఐటీ, విద్య, నైపుణ్య నిర్మాణంపై చర్చించారు. సింగపూర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అంశాలను పోల్చి చూశారు. క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, దాని అవకాశాలపై చర్చించారు. అలానే నిధుల సమీకరణ గురించి చర్చ జరిపారు. కాగా సీఎం బృందం నేడు, రేపు సింగపూర్‌లోనే పర్యటించనుంది. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు నేపథ్యంలో సింగపూర్‌లోని కోర్సులు, ప్రణాళికలు, నిర్వహణను పరిశీలించనుంది. అలానే సింగపూర్‌లోని పారిశ్రామిక వేత్తలతో భేటీ కానున్న సీఎం.. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చించనున్నారు.



రాష్ట్ర క్రీడాకారులకు

## ప్రజా ప్రభుత్వం అండ

- జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో రాణించేలా చర్యలు
- అర్జున అవార్డును అందుకున్న అథ్లెట్ దీప్తి జీవంజి
- అభినందనలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

2లో



సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయానికి

## కరెంట్ కట్

సెస్‌కు రూ.4,58,90,749 విద్యుత్ బకాయి ఉన్న మున్సిపాలిటీ

నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో కరెంట్ సరఫరా నిలిపివేత

కలంజ్యోతి, సిరిసిల్ల : విద్యుత్ బకాయిలు చెల్లించడం లేదంటూ సెస్ అధికారులు సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయానికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దాంతో మున్సిపల్ అధికారులు అంధకారంలోనే విధులు నిర్వహిస్తున్నారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో కంప్యూటర్, ఇంటర్నెట్ సేవలను వినియోగించుకోలేకపోతున్నారు. సిరిసిల్ల మున్సిపాలిటీ సెస్‌కు రూ.4,58,90,749 విద్యుత్ బకాయి ఉంది. విద్యుత్ బకాయిలు చెల్లించాలంటూ డిసెంబర్, జనవరిలలో నోటీసులు జారీ చేసినా కూడా మున్సిపల్ అధికారులు స్పందించకపోవడంతో శుక్రవారం ఆ కార్యాలయానికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాలు

## అర్హులకు అందాలి

- అర్హుల ఎంపిక బాధ్యత అధికారులదే
- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క

3లో





## పేద విద్యార్థికి అవియుక్తరెడ్డి చేయూత

### రూ.55,990 విలువ గల ల్యాబ్ ల్యాప్ ట్యాబ్ అందజేత

**కలంజ్యోతి, చెన్నారావుపేట :**

పేద విద్యార్థికి యువ నాయకుడు దొంతి అవియుక్త రెడ్డి అండగా నిలిచారు. ఉన్నత చదువుల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద విద్యార్థికి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి తనయుడు దొంతి అవియుక్త రెడ్డి రూ.55,990 విలువ గల ల్యాప్ ట్యాబ్ అందజేశారు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా బాపునగర్ గ్రామానికి చెందిన మంతెన సన్నీ సివిల్ ఇంజినీరింగ్ రెండవ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ తాడేపల్లి గూడెం నిట్ లో చదువుతున్నాడు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో మంతెన సన్నీ తండ్రి ప్రభుదాస్ ఎమ్మెల్యే దొంతిని కలిసి తన కుటుంబ ఆర్థిక పరిస్థితిని వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి మనోధైర్యాన్ని కల్పించారు. తన కుమారుడు దొంతి అవియుక్త రెడ్డితో ల్యాప్ ట్యాబ్ అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాదావత్ రాజేందర్, కోర్ర మోహన్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే సత్యం పరామర్శ

**కలంజ్యోతి, మల్యాల :**

మల్యాల మండలంలోని మల్యాల, బల్వంతాపూర్, ముత్యంపేట గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన నాగుల నర్సవ్వ, బొద్దుల నరసయ్య, ఆరేళ్ల దేవమ్మ, శంకరయ్య, కర్బుజా కిరన్మాయి, అంజయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు. అలాగే పలువురు కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ బత్తిని మల్లేశ్వరి, నాయకులు దొంగ అనందరెడ్డి, దారం ఆదిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాంలింగారెడ్డి, మ్యాక లక్ష్మణ్, ప్రతాప్, సంత ప్రకాశ్ రెడ్డి, శనిగారపు తిరుపతి, వంశీ, నక్క అనిల్, తాళ్ళ హరినాథ్, కటకం వినయ్, శ్రీకాంత్, గడిగప్పుల రమేష్, మిట్టి శ్రీను, ప్రశాంత్, ఇమామ్, తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పరామర్శ

**కలంజ్యోతి, నర్సాపూర్ :**

నర్సాపూర్ నియోజకవర్గంలోని హత్నూర మండల్ పరిధిలోని సాధుల నగర్ గ్రామంలోఇటీవల మృతి చెందిన గుడి కాడి నర్సింలు కుటుంబాన్ని పరామర్శించారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి మాట్లాడుతూనర్సింలు కుటుంబీకులకు సానుభూతి తెలిపి బాధ్యత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన అన్నారుఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

# సింగపూర్ ఐటీఈతో కుదిరిన ఒప్పందం



**కలంజ్యోతి, హైదరాబాద్ :**

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ.. సింగపూర్ ప్రభుత్వ ఆధీనంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ)సంస్థతో ఎంఓయు కుదుర్చుకుంది. సింగపూర్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి బృందం శుక్రవారం అక్కడి ఐటీఈలో సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి సహా 20కి పైగా విభిన్న డొమైన్‌ల పనితీరును పరిశీలించింది. ఈ క్రమంలో ఆయా రంగాల్లో పని చేస్తున్న నిపుణులు, సిబ్బందితో రేవంత్ రెడ్డి స్వయంగా సంభాషించారు. హైదరాబాద్ లోని ఫోర్త్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా వివిధ కోర్సులు నిర్వహిస్తున్న తీరును మంత్రి శ్రీధర్ బాబు ఐటీఈ అధికారులకు వివరించారు. నైపుణ్యాల అభివృద్ధి (స్కిల్ డెవెలప్మెంట్) శిక్షణలో భాగస్వామ్యం కోసం పరస్పర సహకారం అందించాలని కోరారు. వీరి అభ్యర్థనలపై ఐటీఈ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందించింది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో కలిసి పని చేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. అనంతరం ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైఎస్ చాన్సలర్ వీఎల్ వీఎస్ఎస్ సుబ్బారావు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పంద కార్యక్రమంలో ఐటీఈ సింగపూర్ అకడమిక్, అడ్మిన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ పర్విందర్ సింగ్, ఐటీఈ ఎడ్యుకేషన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్, జయేష్ రంజన్ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. మరోవైపు తెలంగాణ ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఐటీఈ ప్రతినిధి బృందం త్వరలోనే హైదరాబాద్‌లో పర్యటించనుంది. కాగా సింగపూర్ ఐటీఈ.. పదో తరగతి చదివే విద్యార్థుల స్థాయి నుంచి చదువు పూర్తి చేసిన యువత, ఆసక్తి ఉన్న ఏ వయసు వారికైనా పరిశ్రమలు,ఐటీ సంస్థల సహకారంతో జాబ్ రెడీ శిక్షణను ఇస్తుంది. 'స్కిల్స్ ఫర్ ఫ్యూచర్, స్కిల్స్ ఫర్ లైఫ్' అనే నినాదంతో పనిచేస్తున్న ఐటీఈలో ప్రస్తుతం 28 వేల మంది శిక్షణ పొందుతున్నారు. మొత్తం వంద ఫుల్ టైమ్ కోర్సులకు ఆన్‌లైన్, క్యాంపస్ శిక్షణ ఇక్కడ అందుబాటులో ఉంటుంది. ఐటీఈకి ఐదు వేల పరిశ్రమలతో భాగస్వామ్యం ఉంది. పరిశ్రమలు తమకు అవసరమైన మానవ వనరులకు ఐటీఈలో నేరుగా శిక్షణనిచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయి. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటైన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తన శిక్షకులకు ఐటీఈతో ట్రెయినింగ్ (ట్రెయినింగ్ ఫర్ ట్రెయినర్స్) ఇప్పించేలా ఒప్పందరం కుదుర్చుకుంది. తాజా ఎంఓయు వల్ల సింగపూర్ ఐటీఈ పాఠ్యాంశాలను మనం ఉపయోగించుకునే వీలు కలుగుతుంది. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వీఎల్ వీ ఎస్ఎస్ సుబ్బారావు ఉన్నారు.

# రాష్ట్ర క్రీడాకారులకు ప్రజా ప్రభుత్వం అండ

**కలంజ్యోతి, హైదరాబాద్ :**

క్రీడాకారుల సంక్షేమం.. ఆ రంగాభివృద్ధికి తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. క్రీడాకారులు జాతీయ,అంతర్జాతీయ పోటీల్లో రాణించేలా మెరుగైన స్పోర్ట్స్ పాలసీతో ముందుకుపోతున్నట్లు వెల్లడించారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం జరిగిన జాతీయ క్రీడా అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అర్జున అవార్డును అందుకున్న తెలంగాణ క్రీడాకారిణి పారా ఒలింపియన్ అథ్లెట్ దీప్తి జీవంజికి ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెబుతోన్న క్రీడాకారులను స్ఫూర్తిగా చేసుకుని మిగతా క్రీడాకారులు ఆయా క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. కాగా గతేడాది క్రీడల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన క్రీడాకారులకు రాష్ట్రపతి ముర్ము శుక్రవారం జాతీయ క్రీడా అవార్డులు ప్రదానం చేశారు. రాష్ట్రపతి భవన్ లో జరిగిన కార్యక్రమంలో దేశంలోనే అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధాన్య్ చంద్ ఖేల్ రత్న అవార్డును చెస్ విభాగంలో డి.గుకేశ్,షూటింగ్ విభాగంలో మను బాకర్, హాకీ విభాగంలో హర్మన్ ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ విభాగంలో ప్రవీణ్ కుమార్ లు అందుకున్నారు. ఇందులో ఏపీ, తెలంగాణకు చెందిన అథ్లెటిక్ క్రీడాకారులు జ్యోతి యర్రాజి, దీప్తి జీవాంజిలు అర్జున అవార్డులు అందుకున్నారు. కేంద్రం ఇటీవల ప్రకటించిన క్రీడా పురస్కారాల్లో మొత్తం నలుగురికి ఖేల్ రత్న, 32 మందికి అర్జున్ అవార్డులు ముగ్గురు కోచ్ లకు ద్రోణాచార్య అవార్డులను ప్రకటించారు.





## పాత రేషన్ కార్డులు తొలిగించబోము

### బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**కలంజ్యోతి, కరీంనగర్ :** రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పాత రేషన్ కార్డులు తొలగించడం లేదని బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొత్త రేషన్ కార్డుల పేరుతో పాత కార్డులు తొలిగిస్తామంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. దీనిపై ప్రతిపక్షాలు కావాలనే రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం ఇందుర్తిలో మీడియాతో మాట్లాడారు. పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు, ఇండ్లు ఇవ్వని బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు తమ ప్రభుత్వం రేషన్ కార్డులు, ఇండ్లు ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోతుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 2కోట్లకు 81లక్షల మందికి సంబంధించి 90లక్షలు రేషన్ కార్డులు ఉన్నాయని, వాటిని తొలగించడం లేదన్నారు. ఎప్పుడు తప్పులు లెక్కబెట్టే ప్రతిపక్షాలు సర్వేను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఈ నెల 26 నుండి కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. అర్హత ఉండి గత 10సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేకుండా ,కొత్తగా పెళ్లి అయిన వారికి, కొత్త కుటుంబాలు, మార్పులు చేర్పులు, అర్హత ఉండి కొత్త రేషన్ కార్డులు రాని వారికి అదే రోజు నుంచి రేషన్ కార్డులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. కుల సర్వే ఆధారంగా.. అప్లికేషన్ ల సమాచారం ఆధారంగా కొత్త రేషన్ కార్డులు వస్తాయన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందాలి




**కలంజ్యోతి, నిర్మల్:**


ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ నెల 26 నుండి చేపట్టనున్న పథకాల అమలుపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి ప్రణాళిక కార్యాచరణ సమావేశం నిర్మల్ కలక్టరేట్ లో శుక్రవారం జరిగింది. జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అభిలాష అభినవ్, రాజర్షి షా, కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్సీ దండే విఠల్, శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, వెడ్మ బొజ్జు పటేల్, రామారావ్ పటేల్, పాయల్ శంకర్, తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాలు అర్హులకే అందేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. జనవరి 26 నుంచి ప్రారంభించనున్న పథకాల కోసం రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, సంబందిత శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేసి, లబ్దిదారులను పకడ్బందీగా ఎంపిక చేయాలన్నారు. అర్హులైన వారందరికీ పథకాలు అందజేసే బాధ్యత అధికారులదేనన్నారు. రైతుభరోసా పథకానికి సంబంధించి సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించాలని ఆదేశించారు. గ్రామాల్లో గ్రామ సభలు, పట్టణాల్లో వార్డు సభలను నిర్వహించి గుర్తించిన అర్హుల వివరాలను వెల్లడించాలన్నారు. ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలో నిరుపేదలందరికీ మెరుగైన విద్య, వైద్యం, త్రాగునీరు, విద్యుత్, రోడ్డు సౌకర్యం, తదితర వసతులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇటీవలే నిర్మల్ ఉత్సవాలను విజయంతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ కు, అధికారులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.

**పారదర్శకంగా ఎంపిక..**

అభిలాష అభినవ్ మాట్లాడుతూ లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడతామన్నారు. జిల్లాలో నూతన రేషన్ కార్డుల కోసం 17491 దరఖాస్తులు వచ్చాయని, సర్వే ద్వారా ఇప్పటి వరకు 2924 మంది అర్హులను గుర్తించినట్లు తెలిపారు. సర్వే కొనసాగు తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల లబ్దిదారుల వివరాలు గ్రామ, వార్డు సభలను నిర్వహించి గ్రామ సభల ఆమోదంతో సమగ్ర జాబితాను సిద్ధం చేస్తామని తెలిపారు. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మట్లాడుతూ పథకాలు అర్హులైన నిరుపేదలందరికీ అందేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. క్షేత్ర స్థాయిలో లబ్దిదారుల ఎంపిక అత్యంత పారదర్శకంగా ఉండాలన్నారు. అంతకుముందు రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్లను మంత్రి సీతక్క, కలెక్టర్లు, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, నిర్మల్ అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఐటిడిఒ పిఓ కుష్బూ గుప్తా , మున్సిపల్ చైర్మెన్లు గంౖదత్ ఈశ్వర్, మేడిపల్లి సత్యం, గ్రంథాలయ చైర్మెన్ సయ్యద్ అర్జుమంద్ అలి, మార్కెట్ కమిటీ చైర్మెన్లు ప్రజాప్రతినిధులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉరివేసుకుని భార్యాభర్తల ఆత్మహత్య

**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ జిల్లా దిలావర్ పూర్ మండలం కాల్వ అటవీ ప్రాంతంలో ఒకే చెట్టుకు భార్యాభర్తలు ఊరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. శుక్రవారం జరిగిన ఈ ఘటనలో వీరిద్దరినీ చించోలికి చెందిన దంపతులుగా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





## అప్పు తీర్చాలంటూ బ్లేడ్ తో దాడి

**కలంజ్యోతి, నిర్మల్ : తనవద్ద తీసుకున్న అప్పు తీర్చాలని ఆగ్రహిస్తూ దివ్య అనే యువతిపై సంతోష్ అనే యువకుడు దాడికి పాల్పడ్డాడు. సోఫీ నగర్ కు చెందిన దివ్య సంతోష్ అనే వ్యక్తి వద్ద అప్పు తీసుకుంది. అప్పు తీర్చాలంటూ ఆ యువతిని ఒత్తిడి చేశాడు. ఈ క్రమంలో ఆగ్రహంతో సర్జికల్ బ్లేడ్ తో గొంతు వద్ద కోశాడు. వెంటనే ఆమెను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. దీంతో ప్రమాదం తప్పింది.**

# ఫ్యాబ్రికేషన్ కార్మికులకు రావాల్సిన రెండు నెలల వేతనం చెల్లింపు

### బీఆర్ టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ చొరవ

### కృతజ్ఞతలు తెలిపిన కార్మికులు

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** సూరారం ఇండస్ట్రీ ఏరియాలో 'భాష్ ఖాన్ ఫ్యాబ్రికేషన్'లో ప్రవీణ్, మున్న, ఇద్దరు కార్మికులు ఫ్యాబ్రికేషన్ షాప్ లో గత కొన్ని సంవత్సరల నుంచి ఫ్యాబ్రికేషన్ ఓనర్ భాష దగ్గర పని చేసేవారు. కొన్ని అనివార్య కారణాలవల్ల రెండు నెలల వేతనం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండడంతో ఫ్యాబ్రికేషన్ వర్క్ మానేశారు. జూన్, జూలై నెలల వేతనం రూ.60వేలు ఇవ్వాల్సి ఉండగా పలుమార్లు ఫ్యాబ్రికేషన్ ఓనర్ ఎండి. భాషను ఇంత అడిగిన నిర్లక్ష్యం వహిస్తూ పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన కార్మికులు ప్రవీణ్, మున్న తోటి కార్మికుల ద్వారా మనకు ఎవరైతే న్యాయం చేస్తారో అని తెలుసుకొని, రవిసింగ్ ను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన ఆయన హుటాహుటిన ఫ్యాబ్రికేషన్ షాప్ దగ్గరికి వెళ్లి ఓనర్ ఎండి.భాషతో చర్చించి కార్మికులకు రావాల్సిన వేతనం ఇప్పించారు. ఫ్యాబ్రికేషన్ కార్మికులు మాట్లాడుతూ తమకు న్యాయం చేసిన రవిసింగ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు..



4 కలంజ్యోతి
General News శనివారం 18.01.2025

## అభివృద్ధిపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్ పార్టీకి లేదు

### టీపీసీసీ సభ్యుడు పెండం రామనంద్

**కలంజ్యోతి, చెన్నారావుపేట :**



అభివృద్ధిపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్ పార్టీకి, ఆ పార్టీ నాయకులకు లేదని టీపీసీసీ సభ్యుడు పెండం రామానంద్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారన్నారు. అభివృద్ధి నిధులపై మాట్లాడే అర్హత ఇప్పుడు లేదన్నారు. 5 సంవత్సరాలు ప్రజలు నిన్ను ఆదరిస్తే కోట్ల రూపాయలు నిధులు తెచ్చి అభివృద్ధి చేసిన అని చెప్తున్న నువ్వు అభివృద్ధి అస్తవ్యస్తంగా వదిలిపెట్టి పోయావని విమర్శించారు. రోడ్లు గాని, కమిటీ హాల్స్ గాని, మోడల్ మార్కెట్ గాని, నాన్ వెజ్ మార్కెట్, పాకాల ఆడిటోరియం గాని ఇవన్నీ సగంలో వదిలేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి మధ్యలో వదిలేసి వెళ్లిన చరిత్ర కదా నీది అని నిలదీశారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి వాటన్నింటిని కూడా నిక్కచ్చిగా పూర్తి చేయడం కోసం ప్రయత్నాలు చేస్తున్నారని వివరించారు. అభివృద్ధి నిధులు మేమే తెచ్చామని ప్రగల్భాలు పలకాల్సిన అవసరం లేదని చురకలు అంటించారు. ఎవరు అధికారంలో ఉంటే వారికి నిధులు మంజూరు కావడం జరుగుతుందని వారే అభివృద్ధి చేస్తారన్ని తెలిపారు. కానీ మాజీ ఎమ్మెల్యే నిధులతోనే ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి అభివృద్ధి చేస్తున్నారని చోటామోటా నాయకులు పత్రిక సమావేశాలు పెట్టి విమర్శించే అర్హత వాళ్లకు లేదన్నారు. రాజకీయ పబ్బం జరుపుకోవడం కోసమే విమర్శలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని విమర్శించే నైతిక హక్కు, అర్హత ప్రత్యేక సమావేశాలు పెట్టే నాయకులకు లేదన్నారన్నారు. మాధవ రెడ్డి అండదండలతో రాజకీయంగా ఎదిగి రాజకీయ లబ్ధి కోసం పార్టీలు మారిన మీరు ఎమ్మెల్యే ని విమర్శించే హక్కు ఉందా? అని ప్రశ్నించారు. మీరు భగీరథ పేరుతో ధ్వంసం చేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే దొంతి సహకారంతో రూ.40 కోట్ల తో పట్టణంలో అన్ని వార్డుల్లో సీసీ రోడ్లను పూర్తిస్థాయిలో పూర్తి చేస్తున్నామని వివరించారు. ఇకపై పత్రికా సమావేశాలు పెట్టి నైతిక విలువలు మర్చిపోయి మాట్లాడే చోటామోటా నాయకుల పద్ధతిని మార్చుకోకపోతే ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేగవంతమైన అభివృద్ధి దిశలో భారత్

### ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

**న్యూ ఢిల్లీ:** ప్రపంచంలో భారత్ అత్యంత వేగవంతమైన అభివృద్ధిని సాధిస్తున్న దేశమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శురవారం న్యూ ఢిల్లీలోని భారత మండపంలో నిర్వహించిన 'ఇండియా మొబిలిటీ గ్లోబల్ ఎక్స్ పో 2025' ప్రదర్శనలో పాల్గొని ప్రసంగించారు. ప్రదర్శనలో ఉన్న ఎలక్ట్రిక్ వాహనాలను పరిశీలించి వాటి గురించిన సమాచారాన్ని నిర్వాహకుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆటోమోటివ్ పరిశ్రమ ప్రస్తుతం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. 12 శాతం వృద్ధిని నమోదు చేస్తుందన్నారు. భారత్ లో వేగంగా ఈవీ వాహనాల అమ్మకాల జోరు కొనసాగుతుందని తెలిపారు. చాలా దేశాలు అమ్మకాల్లో వెనుకబడి ఉన్నాయని తెలిపారు. మొబిలిటీ రంగం మరింత విస్తరణకు కేంద్రం అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తుందన్నారు. ఇంతకుముందు విశాలమైన రోడ్లు లేక ఈ రంగంలో కొనుగోళ్లు మందగించి ఉండేవన్నారు. ప్రస్తుతం జాతీయ రోడ్ల నెట్ వర్క్ ను భారీగా విస్తరించడంతో ఆటోమొబిలిటీ రంగం విస్తరణ, అభివృద్ధి సాధ్యపడుతున్నాయని మోదీ తెలిపారు.



## సీపీఆర్‌పై అవగాహన ఉండాలి

### మెడికల్ ఆఫీసర్ ప్రత్యుష మండల

**కలంజ్యోతి, గంగారం :**



సీపీఆర్‌పై అవగాహనా కార్యక్రమాన్ని గంగారాం మండలం వెలుబెల్లి, చెరువు ముందు తండాలో మెడికల్ ఆఫీసర్ మండల ప్రత్యుష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీపీఆర్(కార్డియోపల్మోనరీ రిససిటేషన్)పై అవగాహన కలిగి ఉండాలన్నారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి సత్వరమే సీపీఆర్ అందిస్తే వారి ప్రాణాలు కాపాడొచ్చని సూచించారు.గుండెపోటు గాని శ్వాస తీసుకోలేని వ్యక్తుల ప్రాణాలు కాపాడేందుకు సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన ఉండాలన్నారు. ఎమర్జెన్సీ సమయంలో సీపీఆర్ ప్రక్రియను కొనసాగించక పోతే మూడు నుంచి నాలుగు నిమిషాలు తర్వాత ఆక్సిజన్ లేకపోవడంతో మనిషి బ్రెయిన్ డెడ్ అయ్యే అవకాశాలు ఉంటాయని హెచ్చరించారు. ముందుగా హృదయ సంబంధమైన సమస్య వచ్చినప్పుడు ముందుగా 108 కి కాల్ చేసి ఆ వ్యక్తికి నిమిషానికి 120 సార్లు సీపీఆర్ చేయాలన్నారు. నుదుటి భాగాన్ని చేత్తో పట్టుకొని 30 సార్లు నోట్లో ఊదడం ద్వారా ఆక్సిజన్ అందించవచ్చని దాంతో కొన్ని నిమిషాల పాటు ఆ వ్యక్తిని కాపాడవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్ పీ థెరిస్సా, 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ రవి, పైలట్ ఫక్రుద్దీన్, ఏఎన్ఎం శివరాణి, హెల్త్ అసిస్టెంట్ శ్రీ రాములు, ఆశవర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

## వంద మంది జీపీ కార్యదర్శుల సర్వీస్ బ్రేక్

- నల్గొండ కలెక్టర్ ఇల త్రిపాఠి సంచలన నిర్ణయం
- విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులపై వేటు



**కలంజ్యోతి, నల్గొండ :** విధుల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శులపై వేటు పడింది. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా గత రెండు నెల లుగా విధులకు హాజరు కాని వంద మంది పంచాయతీ కార్యదర్శులపై నల్గొండ జిల్లా కలెక్టర్ ఇల త్రిపాఠి కొరడా ఝుళిపించారు. వారందరీ సర్వీస్‌ను బ్రేక్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ తీసుకున్న నిర్ణయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ముందుగా వారి వివరాలు తీసుకున్న కలెక్టర్ సస్పెండ్ చేయాలని నిర్ణయం తీసుకోగా.. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యద ర్శులందరూ తిరిగి విధుల్లోకి చేరుతామంటూ కలెక్టర్ వద్దకు వచ్చారు. దాంతో గైర్హాజరైన రెండు నెలల కాలానికి సర్వీస్ బ్రేక్ చేసిన కలెక్టర్.. పంచాయతీ కార్యదర్శులకు వేర్వేరు ప్రాంతాల్లో పోస్టింగ్ ఇచ్చారు. కలెక్టర్ నిర్ణయంతో భవిష్య త్తులో రెగ్యులరైజేషన్, ఇంక్రిమెం ట్స్,పెన్షన్ల విషయంలో తమకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని పంచాయతీ కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.